



పట్టణంలో ఊరేగుతున్న సిరిమాను

# సమీపిస్తున్న సమయం

## డిఎస్‌సి అభ్యర్థుల్లో ఆందోళన
## గడువు పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 583 పోస్టులను భర్తీ చేయనున్న విషయం తెలిసిందే. జూన్ 6 నుంచి జులై 6వరకు డిఎస్‌సి పరీక్ష జరుగనుంది. ఇంకా నెలరోజులు మాత్రమే సమయం ఉంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఆన్‌లైన్ పద్ధతిలో నెల రోజులు పాటు ఈ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నోటిఫికేషన్‌కు పరీక్ష సమయానికి మధ్య కాల వ్యవధి తక్కువగా ఉండడంతో గడువు పెంచాలని అభ్యర్థులు కోరుతున్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్‌కు, పరీక్ష తేదీకి మధ్య 45 రోజులు మాత్రమే సమయం ఇవ్వడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. కనీసం 90 రోజుల సమయం ఇవ్వాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం తొలి సంతకం చేశారు. ఆ హామీ మేరకు అధికారంలోకి వచ్చిన పది నెలల తరువాత నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎట్టకేలకు నోటిఫికేషన్ వచ్చిందని అభ్యర్థులు సంతోషిస్తున్నా 45రోజులు మాత్రమే సమయం ఇవ్వడంతో ఆందోళన వ్యక్తం అవుతోంది. డిఎస్‌సి ద్వారా ఉమ్మడి జిల్లాలోని 583 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 446, గురుకులాల్లో 137 పోస్టులు భర్తీ చేయనున్నారు. పదేళ్లుగా డిఎస్‌సి నిర్వహించకపోవడంతో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు డిఎస్‌సిపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 60 నుంచి 80 వేల మంది వరకు అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. డిఎస్‌సి అనగానే రెండవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్న అన్ని పాఠ్య పుస్తకాలనూ అధ్యయనం చేయాల్సి ఉంటుంది. చాలా ఎక్కువ సిలబస్‌తో కూడుకున్నదని, ఎంత బాగా చదివిన వారైనా ఒక్కసారైనా పూర్తిస్థాయిలో రివిజన్ చేయాలంటే కనీసం 60 నుండి 90 రోజులు సమయం పడుతుందని అంటున్నారు. ప్రభుత్వం పది నెలలుగా అదిగో ఇదిగో అంటూ ఎట్టకేలకు నోటిఫికేషన్ ఇచ్చినా చదువుకునేందుకు సమయం ఇవ్వకపోవడంతో అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. 2018 డిఎస్‌సి పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించి నార్మలైజేషన్ చేయడం వల్ల బాగా చదివిన వారికి ఉద్యోగాలు రాకుండా పోయాయని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రమంతా ఒకే పరీక్ష పత్రం కాకుండా తెలంగాణా రాష్ట్రం మాదిరిగా ప్రతి జిల్లాకు ఒక పరీక్షా పత్రం జారీ చేయాలని, దీనివల్ల లీకేజీలు తదితర సమస్యలను అధిగమించవచ్చని అంటున్నారు. కావున తగిన సమయం ఇచ్చి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



కోట వద్ద చెట్ల కింద చదువుకుంటున్న అభ్యర్థులు

### అభ్యర్థులకు సమయమివ్వాలి



డిఎస్‌సి సిలబస్ పూర్తిస్థాయిలో రివిజన్ చేయాలంటే కనీసం 60 నుండి 90 రోజులు సమయం పడుతుంది. నోటిఫికేషన్ పై ఉన్న అభ్యంతరాలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలి. అభ్యర్థులు నష్టపోకుండా ఆఫ్ లైన్ పరీక్ష లేదా ఆన్‌లైన్ అయితే జిల్లా అభ్యర్థులంతా ఒకే పేపర్ రాసేలా చర్యలు తీసుకోవాలి, లేనిపక్షంలో అభ్యర్థులతో కలిసి ఆందోళనకు దిగాల్సి వస్తుంది.

సిహెచ్ హరీష్
డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్

# అంబరం..సిరిమాను సంబరం

- పోటెత్తిన భక్తులు..
- ఆకట్టుకున్న బల్ల వేషాలు
- ఆలయానికి క్యూ కట్టిన సందర్శకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి దాడితల్లి సిరిమానోత్సవం అంబరాన్ని తాకింది. గొల్లపల్లి గ్రామదేవత పండగ సందర్భంగా మంగళవారం సిరిమానోత్సవం ఘనంగా జరిగింది. సిరిమానోత్సవం సాయంత్రం 4.30గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ మూడు గంటల ఆలస్యంగా 7.30గంటలకు ప్రారంభమైంది. సిరిమానును పూజారి బత్తిన కృష్ణ అధిరోహించారు. గొల్లపల్లిలో ప్రారంభమైన సిరిమానోత్సవం దాడితల్లి ఆలయం, ఓంకార్ టాకీస్, మేదరబంద, తాండ్రపాపరాయ జంక్షన్, కోట జంక్షన్, చర్చి సెంటర్, జెండమాల్ జంక్షన్, శ్రీవేణుగోపాల ఆలయం జంక్షన్, వాటర్ ట్యాంక్, పెట్రోల్ బాంక్, రైల్వే జంక్షన్, గాంధీ బొమ్మ, కృష్ణా టాకీస్, గొడవీధి, రావువారివీధి, గొల్లవీధి, కుమ్మరివీధి, మార్కెట్ నాలుగు రోడ్ల జంక్షన్ మీదుగా ఊరేగిన సిరిమాను తిరిగి గొల్లపల్లి చేరుకుంది. సిరిమానోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి భవ్యరెడ్డి, పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### ఆకట్టుకున్న బల్ల వేషాలు

దాడితల్లి సిరిమానోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బల్ల వేషాలు ఆకట్టుకున్నాయి. సిరిమానోత్సవం ముందు వినాయకుడు, దుర్గాదేవి, కాళీమాత, గజలక్ష్మి, అయోధ్యరాముడు, తదితర దేవుళ్ల వేషధారణలో కళాకారులు ఆకట్టుకున్నాయి. బల్ల వేషాలను తిలకించేందుకు భక్తులు ఆసక్తి చూపారు.



ఆకట్టుకున్న బల్ల వేషాలు

### ఆలయానికి క్యూ కట్టిన భక్తులు

దాడితల్లి ఆలయానికి భక్తులు క్యూ కట్టారు. వనం గుడిని ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు రాజా, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, వైసిపి నాయకులు సిరి సహస్ర, భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎమ్మెల్యే బేబినాయన ప్రసాదం పంపిణీ చేశారు.

### సిరిమానోత్సవాన్ని దర్శించుకున్న ప్రముఖులు

సిరిమానోత్సవాన్ని జిల్లా రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు రాజా, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, వైసీపీ నాయకులు సిరి సహస్ర, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, వివిధ శాఖాధికారులు దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

### చలి వేంద్రాలు ఏర్పాటు

దాడితల్లి పండగకు వచ్చిన భక్తులు, ప్రజలు దాహార్తిని తీర్చేందుకు సామాజిక కార్యకర్తలు, దాతలు చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో వాటర్ ప్యాకెట్ల నిషేధం అమలులో ఉండడంతో తాగునీరు కోసం ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడకుండా మున్సిపల్ అధికారులు కూడా చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు.

### పారిశుధ్య కార్మికులు సేవలు భేష్

పండగ సందర్భంగా బొబ్బిలి, గొల్లపల్లిను పరిశుభ్రంగా ఉంచడంతో పారిశుధ్య కార్మికులు మంచి కృషి చేశారు. ఆలయాలు వద్ద ప్రత్యేక కార్మికులను ఏర్పాటు చేసి పారిశుధ్య పనులు నిర్వహించారు. సిరిమానోత్సవం సందర్భంగా సిరిమానును మొక్కేందుకు మోక్కేందుకు విసిరిన అరటి, మామిడి పండ్లు, కొబ్బరి కాయలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి రోడ్లను శుభ్రం చేశారు.



దర్యాప్తు అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

# శాస్త్రీయ పద్ధతిలో ఆధారాల సేకరణే కీలకం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నిందితులపై వివిధ పోలీసు స్టేషన్లలో నమోదవుతున్న కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారు కావాలంటే దర్యాప్తు అధికారులు నేర స్థలం నుండి శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలను సేకరించడం, వాటిని పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్ లకు పంపడం చాలా క్రియాశీలకమని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. ఫోరెన్సిక్ నిపుణుల ఆధ్వర్యంలో జిల్లాలో పని చేస్తున్న దర్యాప్తు అధికారులకు ఒక్క రోజుశిక్షణ కార్యక్రమాన్ని మిమ్స్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. ఎస్‌పి వకుల్ జిందాల్ ముఖ్యఅతిథిగా హాజరై, శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదవుతున్న క్రిమినల్ కేసుల్లో నిందితులు శిక్షింపబడాలంటే నేర స్థలం నుండి ఆధారాలు సేకరించడం, వాటిని సక్రమ పద్ధతిలో లేబిలింగు చేయడం, న్యాయ స్థానంలో నిరూపించడం క్రియాశీలకమన్నారు. నేర స్థలం నుండి ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడం, వాటిని ప్యాకింగు చేయడం, పరీక్షల కోసం సకాలంలో ఫోరెన్సిక్ ల్యాబ్ లకు పంపడం ముఖ్యమైన వ్యవహారమన్నారు. ఈ వర్కుషాపులో ఫోరెన్సిక్ నిపుణులు తెలియజేసిన మెళుకువలను కేసుల దర్యాప్తులో వినియోగించి, న్యాయ స్థానాల్లో నిందితులు శిక్షింపబడే విధంగా కేసులను దర్యాప్తు చేయాలని శిక్షణకు హాజరైన పోలీసు అధికారులకు ఎస్‌పి సూచించారు. నేర స్థలం నుండి ఆధారాలను సేకరించడంలో ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక పద్ధతులను అవలంభించాలన్నారు. నేరానికి పాల్పడిన ప్రతీ నిందితుడు శిక్షింపబడితేనే నేరాలు తగ్గుముఖం పడతాయని అన్నారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో నేరం నిరూపించేందుకు అవసరమైన స్పష్టమైన ప్రశ్నలతో లెటర్ ఆఫ్ అడ్వయిజ్ ప్రిపేర్ చేసి పంపాలని ఫోరెన్సిక్ నిపుణులు దర్యాప్తు అధికారులకు సూచించారు. అనంతరం, వర్కు షాపులో పాల్గొన్న ఫోరెన్సిక్ నిపుణులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, మంగళగిరి, విశాఖపట్నం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణులు వి.ప్రియాంక, ఎం.సుమాలిక, ప్రశాంతి, పలువురు సిఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐ మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యం : మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి- మెంటాడ

గ్రామాభి వృద్ధే పభుత్వం లక్ష్యమని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. కొండలింగాలవలలో మంగళవారం గ్రామ సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె సొంత గ్రామం కావడంతో ప్రజలు సంతోషంగా డప్పులతో, పూలదండలతో, ఊరేగింపులతో, హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ప్రజలకు సులభంగా సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సచివాలయాలను బలోపేతం చేస్తుందన్నారు. మంత్రి గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన భవనంతో గ్రామానికి మెరుగైన పాలన అందుతుందని మంత్రి తెలిపారు. టిడిపి మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు, సీనియర్ పార్టీ నాయకులు గెద్ద అన్నవరం, గొర్లె ముసలినాయుడు, ఎంపిటిసి గుమ్మడి ప్రవీణ్ కుమార్, ఎంపిడిఒ భానుమూర్తి, చినప్పయ్య పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

# మానవ హక్కుల సంరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా గార

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సామాజికంగా, వ్యక్తిగతంగా పీడితుల తరపున అవిశ్రాంతంగా పోరాటం చేసి వారి హక్కులను కాపాడటమే ధ్యేయంగా కషి చేస్తానని భారత మానవ హక్కుల సంరక్షణ రాష్ట్ర అధ్యక్షుడు గార. సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సంస్థ జాతీయ అధ్యక్షుడు ఆర్. ప్రసాదరావు నియామక పత్రాన్ని అందజేసి, బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా పలు జిల్లాల నుంచి విచ్చేసిన భారత మానవ హక్కుల సంరక్షణ బాధ్యులు గార సత్యనారాయణకు సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భారత మానవ హక్కుల సంరక్షణ జాతీయ అధ్యక్షుడు ఆర్. ప్రసాద్ రావు మాట్లాడుతూ మానవ హక్కుల సంరక్షణలో తమ సంస్థ రానున్న రోజుల్లో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. మానవ హక్కులను ఎవరు కాలరాసినా బాధితుల తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ సంస్థలు, సమాజంలో ఏ రకమైన బాధితులు ఉన్నా, వారు తమ దృష్టికి తెస్తే అండగా నిలుస్తామని తెలిపారు.



గార సత్యనారాయణకు నియామక పత్రం అందిస్తున్న జాతీయ అధ్యక్షులు



అరటిపంటను పరిశీలిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎంపి బెల్లాన

# రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

## జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -చీపురుపల్లి

రాష్ట్రంలోనే రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తూ మోసం చేస్తుందని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని పత్తికాయ పాలవలస పంచాయతీ పరిధిలోని కలిశెట్టిబడి గ్రామ ప్రాంతంలో ఇటీవల వర్షాల కారణంగా నేల కొరిగిన అరటి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతులను పరామర్శించి మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా రైతులు పంటలను నష్టపోయినా సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుల కష్టాలను పట్టించుకోవడంలేదన్నారు. జిల్లాలో ఇటీవల పలుచోట్ల అరటి, బొప్పాయి, అపరాల పంటలు నష్టపోయిన రైతులు తమ కష్టాలను చెప్పుకోలేక తల్లడిల్లిపోతున్నారన్నారు. పక్క జిల్లాలోనే వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నప్పటికీ రైతుల కష్టాలను కనీసం పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి రైతుల నష్టాలను తెలుసుకోవడానికి జిల్లాలో పర్యటించాలన్నారు. అపరాలు కొనుగోలు కోసం జిల్లాలో ఐదుచోట్ల కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రకటనలు చేస్తున్నారు తప్ప వాస్తవానికి ఏ ఒక్క సెంటర్ కూడా ప్రారంభం కాలేదని, పంటను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉచిత విద్యుత్తును ప్రకటించిన పాలకులు గడచిన 11నెలల కాలంలో కనీసం ఒక్క రైతుకైనా ఉచిత కనెక్షన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల సమస్యల పట్ల దృష్టి సారించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, రైతుల తరపున వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వైసిపి పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాసనాయుడు, జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, వైసిపి మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, నాయకులు బెల్లాన త్రినాథరావు, రేవల్ల సత్తిబాబు, పతివాడ రాజారావు, గవిడి సురేష్, సర్పంచులు, ఎంపిటిసిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి.నల్లనయ్య

# నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలన్నిటికీ ఈ నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్సులు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కార్యదర్శులకు ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ శానిటరీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెస్టారెంట్లు, నర్సింగ్ హోమ్‌లు, వస్త్ర దుకాణాలు, ప్రైవేటు స్కూలు, కళాశాలలు, సినిమా థియేటర్లు, కళ్యాణ మండపాలు వంటి అన్ని వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్సులు విధించాలన్నారు. ఇప్పటికే ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉన్నవారు ఫీజులు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం నాటికి కాలువల్లో పూడికలు లేకుండా చేయాలన్నారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, సీనియర్ అసిస్టెంట్ రమేష్‌రాజు పాల్గొన్నారు.

### అయ్యన్న పేటలో పర్యటించిన కమిషనర్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం అయ్యన్నపేట ప్రాంతంలో కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యటించారు. పారిశుధ్య పరిస్థితులను గమనిస్తూనే, వీధి దీపాల నిర్వహణ, మంచినీటి పంపిణీ ఏ విధంగా ఉందో పరిశీలించారు. అక్కడక్కడ చెత్తాచెదారాలు నిల్వ ఉండడాన్ని చూసి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం 51 వ నెంబరు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో ఉన్న అన్నాక్యాంటీన్ ను పరిశీలించారు. ఆహారం స్వీకరించే వారు ఎండ బారిన పడకుండా అన్నా క్యాంటీన్ చుట్టూ రూఫ్ ఏర్పాటుకై ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేశారు.

# బ్లాక్ స్పాట్‌ల్లో ప్రమాదాలు జరగకూడదు

- ప్రభుత్వ శాఖలు కార్యాచరణ రూపొందించాలి
- రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్టుగా గుర్తించిన బ్లాక్ స్పాట్ ప్రదేశాల్లో తదుపరి మరో ప్రమాదం జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత ప్రభుత్వ శాఖలపై వుందని, ఆ దిశగా ఆయా శాఖలు చేపట్టాల్సిన కార్యాచరణపై నివేదిక రూపొందించి రెండు రోజుల్లో సమర్పించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో పోలీసు, రోడ్లు భవనాల శాఖలు సంయుక్తంగా తరచూ ప్రమాదాలు జరిగే 48 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని రోడ్డుభద్రత కమిటీ కన్వీనర్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఇ కాంతిమతి తెలిపారు. ఈ ప్రాంతాల్లో రోడ్లలో వున్న లోపాలను గుర్తించి మళ్లీ ప్రమాదాలు సంభవించకుండా చేపట్టాల్సిన చర్యలు, అక్కడ రోడ్లలో చేపట్టాల్సిన సాంకేతిక మార్పులపై కార్యాచరణ రూపొందించాలన్నారు. జాతీయ రహదారులపై రేడియంతో స్టిక్కరింగ్ చేయకపోవడం వల్ల రాత్రివేళల్లో ప్రమాదాలకు కారణమవుతున్నాయని పోలీసు శాఖ అధికారులు వివరించారు. స్పీడ్ బ్రేకర్లు వేసిన చోట్ల రేడియంతో గుర్తులు వేయకపోవడం వల్ల రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు వాటిని గుర్తించలేక ప్రమాదాలకు లోనవుతు న్నారని, దీనిని సరిచేయాలని రోడ్డు భద్రత కమిటీ సభ్యులు మజ్జి అప్పారావు కోరారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా కార్యాచరణ నివేదికలు అందజేయని ప్రభుత్వ శాఖలకు ఛార్జిమెమోలు జారీ చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఉపరవాణా కమిషనర్ మణికుమార్, రోడ్లు భవనాలశాఖ ఇఇ జేమ్స్, డిపిఒ వెంకటేశ్వర రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పద్మశ్రీరాణి, జిల్లా ప్రజారవాణా అధికారి నారాయణ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతమాధవన్

### అగ్రిగోల్డు ఆస్తుల సమగ్ర సర్వే

జిల్లాలో అగ్రిగోల్డుకు సంబంధించిన ఆస్తులను సమగ్రంగా సర్వేచేసి పూర్తి వివరాలను అందజేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఇన్‌ఛార్జి కలెక్టర్ ఛాంబర్‌లో జరిగింది. జిల్లాలోని నాలుగు మండలాల్లో ఉన్న అగ్రిగోల్డు ఆస్తులు, వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అగ్రిగోల్డు ఆస్తుల సర్వేను పూర్తిచేసి, వాటి వాస్తవ విలువను లెక్కించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ సూచించారు. సమావేశంలో సిఐడి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్‌పోలీస్ ఎం.ఎన్. భూపాల్, విజయనగరం, బొబ్బిలి ఆర్‌డిఒలు డి.కీర్తి, రామ్మోహన్,తాహశీల్దార్లు పాల్గొన్నారు.

### చిత్తడి నేలలను పరిరక్షించాలి

పర్యావరణ పరిరక్షణ కోసం జిల్లాలో చెరువులు, కాలువలు తదితర జలావాసాలు, చిత్తడి నేలల పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కోరారు. .జిల్లా చిత్తడి నేలల కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లాలో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా 2,263 చిత్తడి నేలలను గుర్తించి, అటవీశాఖ ద్వారా గ్రౌండ్ ట్రూతింగ్ కూడా పూర్తి చేశారని చెప్పారు. చినపతివాడ, చింతపల్లి గ్రామాల్లో గుర్తించిన రెండు సహజ కాలువలను చిత్తడి నేలలుగా గుర్తించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. జిల్లా అటవీ శాఖాధికారి కొండలరావు, సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్‌కు వినతినిస్తున్న మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు

# మందులపై జిఎస్‌టి ఎత్తివేయాలి

## జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్‌కు మెడికల్ రిప్స్ వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల ఆరోగ్యాలను కాపాడే మందుల ధరలు, పరికరాలు ధరలపై జిఎస్‌టి ఎత్తివేయాలని ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ నాయకులు జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్‌కు మంగళవారం వినతి అందజేశారు. నిర్మలా సీతారామన్‌కు ఈ వినతి పంపించాలని కోరారు. మందుల పరికరాలపై 0 శాతం జిఎస్‌టి ఉండాలని అన్నారు. మందులపై 18 శాతం వరకు జిఎస్‌టి ఉండడంతో వాటి ధరలు ఆకాశానికి చేరుతున్నా యని అన్నారు. వినతినిచ్చిన వారిలో మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి యు ఎస్ రవికుమార్ , జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సూర్య భగవాన్, సుధీర్, కోశాధికారి నరేష్ పాల్గొన్నారు.

# ఆదాయ వ్యయాల మెరుగుపై సంతృప్తి

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ నిధుల నిర్వహణ, ఆదాయ, వ్యయాలు మెరుగుగా ఉన్నాయని గణాంక ప్రాంతీయ ఉపసంచాలకులు పి. సీతారామారావు సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళ వారం కమిషనర్ పల్లి నల్లనయ్య గణాంక అధికారులు సమావేశమయ్యారు. సీతారామారావు మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో నగరపాలక సంస్థ గణనీయమైన వృద్ధిని సాధించిందని తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయం పై శిక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కల్పించారు. మంగళవారం ప్రకృతి వ్యవసాయం ఆర్‌టిఒ ప్రకాష్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి నవధాన్యాలు సాగు, పచ్చిరొట్ట ఎరువులు చేయడం వల్ల జరిగే ఫలితాలు వివరించారు. ముఖ్యంగా నవ ధాన్యాలు సాగు, పచ్చి రొట్ట ఎరువులు వేయడం వల్ల నేల సారవంతం అవుతుందని, పంటలు వేరు వేరు వ్యవస్థలు ఉండటంతో భూమిలో సూక్ష్మ జీవులు వృద్ధి చెంది పోషకాలు పెరుగుతాయని చెప్పారు. పూత దశలో కలియ దున్నడం కలుపు సమస్య తగ్గుతుందన్నారు. రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వేయాలని కోరారు. నవధాన్యాలు కిట్‌లు, పచ్చిరొట్ట ఎరువులు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి వ్యవసాయ అధికారి టి.సంగీత, మండల వ్యవసాయ అధికారి ఎం. పూర్ణిమ, ఎఇఒ శ్యాంకుమార్, విఎఎ శివకుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంటి వెంకటలక్ష్మి, ఐసిఆర్ పి.లక్ష్మి, ఎంపి టిసి చందక చిన్నంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

## ఆధార్ ప్రత్యేక శిబిరం పరిశీలన

ప్రజాశక్తి- బాడంగి

మండలంలో పిన్నవలస సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఎంపిడిఒ రామకృష్ణ మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 66 మంది పిల్లలు ఆధార్ ఎన్రోల్ చేసుకోవాల్సి ఉందని, కేవలం ఇప్పటి వరకు 6 మంది పిల్లలు మాత్రమే ఎన్రోల్ చేసుకున్నారని మిగతా వారి తల్లిదండ్రులు ప్రభుత్వం పెట్టిన షెడ్యూల్ ప్రాప్తికి పిల్లలందరితో ఆధార్ ఎన్‌రోల్ చేసుకునే విధంగా సహకరించాలని కోరారు. ఈ 66 మందిలో ఎవరైతే ఇప్పటికే ఎన్‌రోల్ చేసుకున్నారో వాళ్ళందరూ అంగన్వాడీ టీచర్ వద్ద ఉన్న యాప్‌లో అప్డేట్ చేయాలన్నారు.

## కిశోర బాలికలకు పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - వేపాడ

కిషోర బాలికలకు పరిశుభ్రత అవసరమని, ఋతుక్రమంలో ఈ జాగ్రత్తలు మరింత అవసరమని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. వేపాడ 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం బాలికల పరిశుభ్రతపై ఎంఎస్‌కె, ఎఎన్‌ఎంలు కిషోర్ వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తలుపులమ్మతల్లి విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని నీలకంఠరాజపురంలో తులుపులమ్మ తల్లి గ్రామ దేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ కమిటీ సభ్యులు ఎం. అప్పలనాయుడు, ఎన్. దేముడునాయుడు మంగళవారం తెలిపారు. బుధ, గురు, శుక్రవారాల్లో మూడు రోజులు పాటు ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బుధ, గురువారాల్లో గ్రామ దేవతకు హోమాలు, ప్రత్యేక పూజలు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తామన్నారు. 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారిని డాక్టర్ ఎస్ జీవనరాణి ఆకస్మికంగా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశా డే ఆజెండా వైద్యాధికారిని అడిగి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో అందుతున్న వైద్య సేవలు గురించి అడిగారు. ఒక్కొక్క ప్రోగ్రామ్ గురించి ఆశా కార్యకర్తలతో మాట్లాడించారు. ఈడిడి క్యాలెండర్ కోసం ఎంఒని పరిశీలించారు. ఆసుపత్రిలో లేబరేటరీ రూమును పరిశీలించి రక్త పరీక్షలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో లోపల, బయట అంతా పరిశీలించి మెడికల్ అధికారికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.శరణ్య, సిహెచ్ఒ రాజు, ఎంపిహెచ్ఈఓ సిహెచ్ సత్యనారాయణ, ఎంపి హెచ్ఎస్ సూరిబాబు, హెచ్‌వి రహమత్ ఉన్నిసా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిమ్స్‌విద్యార్థులు యాంటీ డ్రగ్స్ ర్యాలీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా మిమ్స్ మెడికల్ కళాశాల విద్యార్థులు, పోలీసులు మంగళవారం యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై నినాదాలు చేశారు. మిమ్స్ ప్రధాన గేటు నుంచి రామతీర్థం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిమ్స్ డీన్ డాక్టర్ సి.హెచ్ లక్ష్మీ కుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.రఘురాం, మిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.గణేష్, భోగాపురం సిఐ రామకృష్ణ, ఎస్ఐ బి.గణేష్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని పెనుబాక, బొద్దాం సచివాలయాలను ఎంపిడిఒ శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మన మిత్ర వాట్సప్ పై డోర్ టు డోర్ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ సర్వీసులు ప్రజలకు ఆటోమేటిక్ ఎప్పటికప్పుడు ప్రభుత్వ అకౌంట్‌కి జమ చేయాలని, హౌస్ హోల్డ్ జియో సర్వే, సూక్ష్మ చైల్డ్ ఆధార్ నమోదు, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేలను పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలకు రోజు వారి తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. హౌస్ టాక్స్ కలెక్షన్, సిబ్బంది సమయపాలన సక్రమంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు మంగళవారం విజయవాడలో కలిశారు. వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవ ప్రసాదాన్ని ఈ సందర్భంగా ఆయనకు అందజేశారు.

## కుట్టుమిషన్ల కుంభకోణంపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

కూటమి ప్రభుత్వంలో కుట్టుమిషన్ల కుంభ కోణంపై విచారణ జరపాలని వైసిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మహంతి జనార్దన్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు శిక్షణతో పాటు ఉచిత కుట్టు మిషన్లు ఇవ్వాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారన్నారు. ప్రభుత్వం ఉచిత కుట్టు మిషన్ పంపిణీలో మొదట 100 కోట్లతో ప్రతిపాదన చేశారన్నారు. అయితే కూటమి నేతల లబ్ది కోసం ఏకంగా రూ.257 కోట్లకు వ్యయం పెంచారన్నారు. నిధులు విడుదలైనా ఎవ్వరికి శిక్షణ ఇవ్వకుండా భారీ స్కామ్‌కు టిడిపి నాయకులు తెరలేపారని ఆరోపించారు. మండలంలో ఒక్క మిషన్ కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై వెంటనే విచారణ జరపాలని కోరారు. ఆయనతో పాటు పూసపాటిరేగ సర్పంచ్ చొంపల సీతారాం, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు మహంతి లక్ష్మణరావు, చౌడువ అగ్రహారం సర్పంచ్ కొత్తకోట శ్రీరామ్, మాజీ ఉప సర్పంచ్ బందపు రామారావు, వైసిపి నాయకులు రౌతు సత్తిబాబు, కోరాడ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## కంప్యూటర్‌పై పట్టు సాధించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కంప్యూటర్ శిక్షణ ద్వారా దానిపై పట్టు సాధించాలని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి. సన్యాసిరావు అన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో నిర్వహించబడుతున్న వేసవి శిక్షణ తరగతులలో భాగంగా విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చారు. పి. సన్యాసిరావు మాస్టారు కథలు నేర్పించగా, తమ్మిన ఉజ్వలక్షణ విద్యార్థులకు డాన్స్, సంగీతం నేర్పించారు.

## నేడు డయల్ యువర్ డిపిటిఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఆర్‌టిసి డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం బుధవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డిపిటిఒ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విజయనగరం ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డిపో పరిధిలో గల ప్రయాణికులందరూ ఎటువంటి సమస్యలున్నా బస్సు రూట్లు, సమస్యలు, సలహాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. సమస్యలపై డిపిటిఒ ఫోన్ నంబర్ 9959225604 కు సంప్రదించాలన్నారు.

# 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్

ప్రజాశక్తి - జామి

లేబర్ కోడ్స్ రద్దు, ఆశావర్కర్ల గుర్తింపు, కనీస వేతనం అమలు వంటి అంశాలపై మే 20న జరగబోయే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం జామిలో ఆయన ఆశా కార్యకర్తలు, కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించాలని, ఆశాలతో పాటు స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒప్పంద జిఒలు విడుదల చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్స్ సాధనకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్ల అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటి పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాలు సుజాతమ్మ, సత్యవతి, జయలక్ష్మి, నాగమణి, కృష్ణవేణి, అమ్మతల్లి పాల్గొన్నారు.

**సంతకవిటి:** మే 20న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల నాయకులు గౌరీ, ధనలక్ష్మి, సుశీల పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని మండవకురిటిలో ఆశా వర్కర్లు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం పిహెచ్‌సి వైద్యాధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సంతకవిటి: వైద్యునికి సమ్మె నోటీసు అందిస్తున్న ఆశా కార్యకర్తలు

**లక్కవరపుకోట:** సమ్మెను జయప్రదం చేద్దామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ పిలుపునిచ్చారు. సిఐటియు కార్యాలయంలో వివిధ రంగాల ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులతో సమావేశమయ్యారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక చట్టాలను పటిష్ట పరచాలని చేపటనున్న సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. అనంతరం ఎంపిడిఒ అప్పారావు, పిహెచ్‌సి వైద్యాధికారి అనిల్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా కమిటీ సభ్యులు గొల్ల దేవి, మండల కార్యదర్శి టి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**వంగర:** ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాలు పిలుపుమేరకు జరుగు సమ్మెలో పాల్గొంటున్నట్లు సిఐటియు ఆధ్వర్యంలో వైద్యాధికారి సిహెచ్ జ్యోతికి సమ్మె నోటీసు వారంతా అందజేశారు. యూనియన్ నాయకులు రూపవతి, నాగరత్నం, మరియమ్మ, సత్యవతి, తులసి, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

**పూసపాటిరేగ:** 20న దేశవ్యాప్త సమ్మె సందర్భంగా పూసపాటిరేగ సూర్యోదయ జూనియర్ కాలేజీలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి సూర్యనారాయణ అధ్యక్షతన మంగళవారం సదస్సు నిర్వహించారు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను సమూలంగా మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురాబో తున్నారన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకుడు కోలామూర్తి, విఆర్‌ఎ సంఘం మండల అధ్యక్షుడు డి భద్ర, గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకుడు అదపాక రాము, ఆశ కార్యకర్తల సంఘం పిహెచ్‌ఈ నాయకురాలు బి రాజేశ్వరి, బి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

**విజయనగరం టౌన్:** సమ్మెలో ఆశ వర్కర్లంతా పాల్గొంటున్నామని విజయనగరం అర్బన్, రూరల్ ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లకు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందించామని యూనియన్ జిల్లా నాయకులు వెంకటలక్ష్మి, మహాలక్ష్మి, సిఐటియు నగర అధ్యక్షులు ఏ. జగన్మోహన్‌రావు తెలిపారు. రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, విజయనగరం అర్బన్‌లో బీసీ కాలనీ, లంకపట్నం, గాజులు రేగ, పూల్ బాగ్, వీటి అగ్రహారం, అరుంధతి నగర్, కేఎల్ పురం, తదితర అర్బన్ హెల్త్ సెంటర్లో మెడికల్ ఆఫీసర్లకు, హెచ్చీలకు సమ్మె నోటీసులు అందించామన్నారు. కార్యక్రమంలో సునీత, కనకమహాలక్ష్మి, నాగమ్మ, పైడ్రాజు, రాజేశ్వరి, పాల్గొన్నారు.



ఎల్‌కోట: సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

**ఐసిడిఎస్ సూపరెండెంట్‌కు అంగన్వాడీ యూనియన్ వినతి**

ఈనెల 20న జరుగు దేశ వ్యాప్తసమ్మెలో సమ్మెలో పాల్గొంటామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మంగళవారం ఐసిడిఎస్ పీడీ ఆఫీస్ సూపరింటెండెంట్ సదాశివకు సమ్మె నోటీస్ ఇచ్చారు. కార్మిక కోడ్లను రద్దు చేయాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ అనసూయ, జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు విశాల పాల్గొన్నారు.

# అంగన్వాడీల బలోపేతానికి చర్యలు

- 79 పోస్టుల భర్తీకి సిద్ధం
- ఐసిడిఎస్ పీడీ సుల్తాన్ బేగం

ప్రజాశక్తి - రామభద్రపురం

అంగన్వాడీ కేంద్రాలు బలోపేతం చేయడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఐసిడిఎస్ పీడీ షేక్ రుక్సానాసుల్తాన్‌బేగం అన్నారు. మండలంలోని బూసాయ వలస అంగ న్వాడీ కేంద్రంలో మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించి కిశోర్ బాలికలతో మాట్లాడారు. అంగ న్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నా మన్నారు. ముఖ్యంగా కిశోర బాలికలకు ప్రతీ మంగళ, శుక్రవా రాలు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అన్ని కేంద్రాల్లో మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని గర్భిణులకు అందిస్తున్నారని తెలిపారు. జిల్లాలో 12 అంగ న్వాడీ టీచర్లు, 67 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, జిల్లా 2,499 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో 293 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. వీటన్నింటికి పక్కా భవనాలు కల్పించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. బేటీ పడావా, బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా జీవో నెంబరు 39 ప్రకారం బాల్య వివాహాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి గ్రామ సర్పంచ్ చైర్‌పర్సన్‌గా ఉంటూ 11 మంది సభ్యులను నియమించి ఒకటి, మూడవ శుక్రవారాల్లో గ్రామాల వారీగా మహిళా పోలీ సుల ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని తెలి పారు. జిల్లాలో 2024 -25 సంవత్సరంలో 25 బాల్య వివా హాలు నిరోధించామని, వీరిలో కొంత మందిపై కేసులు కూడా నమోదు చేశామని చెప్పారు. ముఖ్యంగా కిశోర బాలికలు ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని తెలిపారు. కిశోర వికాశం-2పై విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నామన్నారు. సిబ్బంది సమయపాలన పాటించి కేంద్రాలను సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లక్ష్మీ, బాడంగి సిడిపిఒ రాజ్యలక్ష్మి, సూపర్వైజరు కృష్ణకుమారి, సూర్యకుమారి పాల్గొన్నారు.

**విజయనగరం:** కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రోటీన్లు కలిగిన మంచి ఆహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ ఎసిడిపిఒ తవిటి నాయుడు తెలిపారు. ఈనెల 2నుంచి జరుగుతున్న కిశోర వికాసం కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సిపి గుడి అంగన్వాడీ కేంద్రం పరిధిలో ఉన్న కిశోరి బాలికలకు రుతుస్రావంపై మహిళా సంరక్షణ కార్యదర్శి భారతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ పౌష్టికాహారం, బాలికలలో వచ్చే రుతు చక్ర సమస్యలు, బాలల హక్కులు, విద్యా, కెరీర్, బాల్య వివాహాలు, టీనేజ్ గర్భిణీ, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం, శారీరక వ్యాయామం వాటిపై దశలవారీగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. బాలికల్లో ప్రతినెల వచ్చే రుతుస్రావంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. యుక్తవయసులో ప్రోటీన్లు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే ఆడపిల్లలు ఆరోగ్యంగా ఉండి క్రమం తప్ప కుండా రుతు స్రావం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లను అందిస్తున్న పీడీ

# పోలింగ్ కేంద్రాల్లో సమస్యలుంటే పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలుంటే పరిష్కరిస్తామని నియోజకవర్గం ఎఇఆర్‌ఒ బి.సుదర్శనరావు తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అఖిల పక్షం నాయకులతో ఎన్నికల డిటి వివిఆర్ జగన్నాధరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఇఆర్‌ఒ సుదర్శనరావు మాట్లాడుతూ నియోజ కవర్గం మొత్తంలో 248, మండలంలో 70 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వాటిలో ఏవైనా సమస్యలుంటే పరిష్కరిస్తామని అన్నారు. అఖిల పక్షం నేతలు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వేరువేరుగా ఓట్లు నమోదయ్యాయని వాటిని సరి చేయాలని కోరారు. ఓట్లు ఒక దగ్గర పోలింగ్ కేంద్రం ఒక దగ్గర ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై ఎఇఆర్‌ఒ సుదర్శనరావు మాట్లాడుతూ చేర్పులు, మార్పులు నిరంతరం ప్రక్రియ కాబట్టి వాటిని సరి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, టి. అప్పలనరసయ్య, బిజెపి నాయకులు మైపాడ ప్రసాద్, చందక గోవింద, జనసేన నాయకులు పతివాడ అచ్చంనాయుడు, అదపాక చిన్న, కాంగ్రెస్ నాయకులు కె.పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఇఆర్‌ఒ సుదర్శనరావు

# ఆర్‌డిఒ క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొంతమంది రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చామలాదేవి అగ్రహారం వద్ద నిర్మించిన క్వారీ గిడ్డింగ్ నిర్మాణానికి సంబంధించిన రికార్డులను ఆర్‌డిఒ దాట్ల కీర్తి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆతవ గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ప్రతి రైతుకు సర్వే ఫలితం దక్కే విధంగా సర్వే ఉండాలని, ఏ విధమైన లోపం ఉన్నా సంబంధిత సిబ్బందిపై కఠినమైన చర్యలు ఉంటాయని సిబ్బందికి తెలిపారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ జె.రాములమ్మ, ఎంఆర్‌ఐ. రామలక్ష్మి, మండల సర్వేయర్ జగన్నాథం, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్ రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాట్ల కీర్తి

# చట్టాలపై అవగాహన అవసరం

### జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం

అసంఘటితరంగ కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. విజయనగరంలోని కార్మిక శాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్మికశాఖలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ఆరా తీశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఎంతమంది కార్మికు లు లబ్ధి పొందారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్మిక శాఖ భవన ఆవరణలో అసంఘటిత కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్మిక చట్టాలు, వేతన సవరణ చట్టం, వారి హక్కులు బాధ్యతలు గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్మికులకు ఉచిత న్యాయం అందిస్తుందని తెలిపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 15100కి ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని చెప్పారు. కార్మికులకు, కర్షకులకు న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. అనంతరం అర్హులైన అసంఘటిత కార్మికులకు ఈ శ్రమ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎ.శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు జి.తిరుపతి పాల్గొన్నారు.

**బొబ్బిలి:** కార్మికులతో వెట్టిచాకిరి చేపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జూనియర్ సివిల్ జడ్జి హేమ స్రవంతి జానకీరామ్ అన్నారు. స్థానిక కోర్టులో మంగళవారం కార్మిక చట్టాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. పరిశ్రమలు, షాపులు, ఇళ్లల్లో కార్మికులతో వెట్టిచాకిరి చేపిస్తే మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా పడుతుందన్నారు. కార్మిక చట్టాల ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రోహిణిరావు, బార్ అధ్యక్షులు ఎం.మోహన మురళీ కుమార్, కార్యదర్శి కె.సింహాచలం, న్యాయవాదులు పాల్గొన్నారు.

# హేతుబద్ధీకరణ నుంచి మినహాయించండి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులను హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలని వ్యవసాయ విస్తరణ అధికారుల ఉమ్మడి జిల్లాల సంఘం నాయకులు జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షులు ఎం.నాగరాజు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల హేతుబద్ధీకరణలో కొన్నిచోట్ల తమను కూడా గ్రామసాయిలోని రైతు సేవా కేంద్రాలలో వేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. తమను మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సహాయకులుగా నియమించాలని కోరుతున్నామన్నారు. కార్యదర్శి పి.కుర్మారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కూడా వ్యవసాయ విస్తరణ అధికారులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ ప్రభుత్వంలో అయినా న్యాయం చేస్తారని ఆశించిన ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 15ఏళ్లకు పైబడి వ్యవసాయ విస్తరణ అధికారులుగా పనిచేస్తున్న కనీసం ఉద్యోగోన్నతి కల్పించకుండా, తమకు సంబంధంలేని గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది అయిన గ్రామ వ్యవసాయ సహాయకులకు అదనపు సిబ్బంది గా నియమించడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఈ విషయమై వెంటనే స్పందించి తమను మండల కార్యాలయాల్లో వ్యవసాయ అధికారులకు సహాయకులుగా నియమించా లన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి ఎం. సూరిబాబు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పి.జగన్నాథ రావు, సభ్యులు హేమ మహేశ్వరరావు, గిరిబాబు పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందిస్తున్న సంఘం నాయకులు

# స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి- డెంకాడ

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్ మండల స్టాక్ పాయింట్‌ను అక్కివరం ఆదర్శపాఠశాలలో మంగళవారం సమగ్రశిక్ష సెక్టోరియల్ టీమ్ సిఎంఒ ఆదినారాయణ, సహ సిఎంఒ రామారావు పరిశీలించారు. ఇంతవరకు వచ్చిన స్టాక్ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. రూమ్ ప్లాన్ ప్రకారం స్టూడెంట్ కిట్ ఐటమ్స్ వారీగా బాగా ఏర్పాట్లు చేశారని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 శ్రీరాము, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌యమ్‌టిలు, ఐఈఆర్‌పిలు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

**వేపాడ:** స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల పుస్తకాల స్టాక్ పాయింట్‌ను మంగళవారం జిల్లా డివైఇఒ కెవి రమణ పరిశీలించారు. ఇంత వరకు వచ్చిన స్టాక్ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎన్.నాగభూషణ రావు, పి.బాల భాస్కరరావు, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌యమ్‌టిలు, ఇన్‌స్టక్టర్స్ పాల్గొన్నారు.

# గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గంట్యాడ

గజపతినగరం మండలంలోని ఎం వెంకటాపురం గ్రామానికి చెందిన వసాది హరీష్ (30) అనే వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం ప్రకారం.. మృతుడు హరీష్ సోమవారం ఉద్యోగం నిమిత్తం ఇంటి వద్ద నుంచి అరకు బయలుదేరాడు. మండలంలోని కొండ తామరపల్లి ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఎదురుగా తోటలోకి వెళ్లి వెంట తెచ్చుకున్న గడ్డి మందు తాగాడు. గుర్తించిన స్థానికులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. అప్పులు పాలవడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# సారా తయారు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొబెషన్ అండ్ ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు హెచ్చరించారు. మండలంలోని గొల్లలపేట పంచాయతీ జోగిందొరవలస గ్రామంలో నవోదయం- 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామస్తులకు నాటుసారా వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామాన్ని నాటుసారా తయారు చేసే కేటగిరి - బి గ్రామంగా గుర్తించామని, ఆ తరువాత 3 నెలల నుంచి ఈ గ్రామంలో విస్తృతంగా అవగాహనా సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేశామని తెలిపారు. గ్రామంలో ఉన్న పాత సారా ముద్దాయిలను బైండోవర్ చేయడం, విరివిగా దాడులు నిర్వహించి తనిఖీలు చేయడంతో ఈ సారా తయారీ సంపూర్ణంగా నిలిచిపోయిందన్నారు. గ్రామం నుంచి ఒక్క ఫిర్యాదు కూడా నమోదుకాకపోవడంతో ఈ జోగిందొరవలస గ్రామాన్ని సారా రహిత గ్రామంగా ప్రకటించా మని, గ్రీన్ విలేజ్‌గా పరిగణించామని చెప్పారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని అన్ని గ్రామాల్లో కూడా ఎక్సైజ్ సిబ్బందితో దాడులు నిర్వహించి సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లలపేట సర్పంచ్ కడుపుకూటి రమ్య, ఎక్సైజ్ ఎస్ఐ రాముడు, పంచాయతీ సెక్రటరీ పువ్వల పార్థసారధి, ఫారెస్టు బీట్ ఆఫీసర్ స్వప్న, విఆర్‌ఒ ఆనందరావు, స్వయం సహాయక గ్రూపులు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు

# అథ్లెటిక్స్‌కు క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ది గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం ఛారిటబుల్ ఫౌండేషన్ తరపున ప్రతినెలా చేసే దాతృత్వ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం 20 మంది జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారులకు స్పోర్ట్స్ యూనిఫాం అందజేశారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షురాలు రాధిక మంగిపూడి, ప్రధాన కార్యదర్శి సూర్యలక్ష్మి, ఉపాధ్యక్షులు కెఆర్‌కె రాజు, సహాయ కార్యదర్శి హరిగోపాల్, కోశాధికారి రవికుమార్, కార్యవర్గ సభ్యులు సుధా నాయక్, చంద్రశేఖర రావు, మల్లి , గుగ్గిలం రామారావు ,సుభద్ర దేవి తదితరులు పాల్గొన్నారు.

# శివలింగాన్ని పరిశీలించిన పురావస్తుశాఖాధికారులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కొవ్వాడ అగ్రహారం శ్మశానంలో ఉన్న స్వయంభు శివలింగాన్ని, దానికి సమీపంలో ఉన్న రాతి విగ్రహాలను మంగళవారం పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. పాల్గుణరావు పరిశీలించారు. ఆ శివలింగానికి ఉపయోగించిన రాయిని, దాని స్వభావాన్ని పరిశీలించారు. అనంతరం సర్పంచి కోట్ల రఘుతో మాట్లాడుతూ ఈ శివలింగం సుమారుగా 13వ శతాబ్దానికి చెందినదన్నారు. ఈ ప్రాంతాన్ని 6వ శతాబ్దం నుండి 13వ శతాబ్దం వరకూ తూర్పు గాంగులు పాలించేవారన్నారు. వారి చివరి కాలంలో సుమారుగా 13వ శతాబ్దంలో ముస్లీంల దండయాత్రలో ఈ విగ్రహాలు ధ్వంసం చేసి ఉంటారన్నారు. ఆ కాలంలో ఇక్కడ ఉన్న గుడిని, విగ్రహాలను ధ్వంసం చేసి ఉండొచ్చన్నారు. శివలింగంతో పాటు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు, వినాయకుడు, దేవాతా విగ్రహంతోపాటు పురాతన రాలు ఉన్నాయన్నారు. ఈ విగ్రహాలకు సమీపంలోనే ఉన్న మైసాస రమర్దిని విగ్రహం సుమారుగా వెయ్యి ఏళ్ల నాటిదిగా గుర్తించామన్నారు. సర్పంచి రఘు మాట్లాడుతూ త్వరలో ఈ పురాతన శివలింగానికి ఆలయం నిర్మాణం చేయాలన్న ఉద్దేశంతో ఉన్నామన్నారు. ఈ పురాతన విగ్రహాలకు మరమత్తులు చేయాలని పురావస్తు శాఖవారిని కోరారు. తమ గ్రామంలో ఉన్న పురాతన సంపదను కాపాడుకుంటామన్నారు. ఆయనతో పాటు ఆలయ కమిటీ మెంబర్లు కోట్ల సత్యం నాయుడు, లెంక రామకృష్ణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.



పురాతన విగ్రహాలను పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారి